# ప్రజాశక్తి

సోమవారం 8 డిసెంబర్ 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# గుర్రాల పార్కుకు సన్నాహాలు

◆ అప్పుడు అక్రమం.. ఇప్పుడు సక్రమమా ?

◆ గతంలో కౌన్సిల్‌లో చేసిన తీర్మానాలు ఏమైనట్టు ? ◆ ఇప్పటి వరకు జరిగిన పనులపై విచారణ లేనట్టేనా ?

ప్రజాశక్తి - ఆరిలోవ

**ముడసర్లోవ పార్కు వద్ద గుర్రపు స్వారీ శిక్షణ పార్కుకు మళ్లీ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జివిఎంసిలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు టిడిపి కార్పొరేటర్లు దీన్ని వ్యతిరేకించారు. అధికారంలోకి వచ్చిన తరువాత, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నాక తిరిగి అదే గుర్రాల పార్కును చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అప్పుడు అక్రమం అయితే.. ఇప్పుడు సక్రమం అయిపోతుందా ? అన్న విమర్శలు ఇప్పుడు నగరమంతటా వినిపిస్తున్నాయి.**



గుర్రాల పార్కు ప్రతిపాదిత ప్రాంతం

### నాడు ఏం జరిగింది ?

ముడసర్లోవ పార్కుకు ఆనుకొని ఉన్న స్థలంలో 2023లో జివిఎంసి కౌన్సిల్‌లో ఆమోదం లేకుండానే అక్రమంగా రూ.6 కోట్లు నిధులతో గుర్రాల స్వారీ శిక్షణా పార్కు నిర్మాణం చేపట్టారు. కౌన్సిల్ సభ్యులకు తెలియకుండానే భారీగా ముడుపులు తీసుకొని రూ.3 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రథు అసోసియేట్ అనే సంస్థకు చెందిన కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. 2024 డిసెంబరు 11న జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో దీనిని వ్యతిరేకిస్తూ, అప్పట్లో ఈ ప్రాజెక్టును రద్దు చేస్తూ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా అక్రమంగా కాంట్రాక్టర్‌కు ఇచ్చిన రూ.3 కోట్లు అడ్వాన్స్ చెల్లింపులు తిరిగి వసూలు చేయాలని, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర విచారణ చేపట్టేందుకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో కమిటీ వేయాలని నిర్ణయించారు. తీర్మానం చేశారు. ఇప్పుడు టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఎన్నికైన తరువాత తిరిగి గుర్రపు స్వారీ శిక్షణా పార్కు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఇప్పుడున్న మేయర్ గతంలో రద్దు చేసిన గుర్రాల స్వారీ పార్కునే ప్రతిపాదించడం వెనుక మతలబు ఏంటని ? సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రశ్నిస్తున్నారు. 'వాటర్ క్యాచ్‌మెంటు ఏరియాలో ఎటువంటి సిమెంటు నిర్మాణాలూ చేపట్టకూడదు. ఇటువంటి నిర్మాణాలు చేపడితే భూగర్భ జలాలు ఎండిపోతాయి. పర్యావరణానికి మిగతా 2లో..

# మ్యాజిక్ డ్రెయిన్లతో మురుగుకు చెక్

◆ ఖర్చు తక్కువ.. ప్రయోజనం ఎక్కువ

◆ 'ప్రజాశక్తి'తో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి






**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్**

సంప్రదాయ మురుగు కాలువలకు ప్రత్యామ్నాయంగా మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తే మురుగు సమస్యకు చెక్ పెట్టవచ్చని డ్వామా విశాఖపట్నం ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి అన్నారు. దీనికి ఖర్చు తక్కువ.. ప్రయోజనం ఎక్కువ అని తెలిపారు. ఈ ప్రక్రియపై 'ప్రజాశక్తి'కి ఆమె పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

**మ్యాజిక్ డ్రెయిన్ కాన్సెప్ట్ కొత్తదిలా ఉంది ?**

నగర ప్రాంతాలలో కంటే గ్రామీణ ప్రాంతాలలో మురికినీటి కాలువల నిర్మాణం, నిర్వహణ అధికారులకు పెద్ద సవాల్. దానికి ప్రత్యామ్నాయ పద్ధతి మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం. మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కొత్త కాన్సెప్ట్.

**మ్యాజిక్ డ్రెయిన్ల వల్ల ఒనగూరే అదనపు ప్రయోజనమేంటి ?**

సంప్రదాయ మురుగునీటి కాలువల పద్ధతిలో మురుగునీటిని ఏదో ఒక చోట పెద్ద కాలువలోకి మళ్లించాల్సి ఉంటుంది. పెద్ద కాలువలు నిర్మాణం కాని చోట మురుగునీరు ఒకేచోట నిల్వ ఉండి నిత్యం దుర్గంధం వెదజల్లుతూ, పలు రోగాలకు కారణంగా ఉంటుంది. మ్యాజిక్ డ్రెయిన్లతో ఇటువంటి సమస్యలు తలెత్తవు. ఈ డ్రెయిన్లు మురుగు నీటిని నేరుగా భూమిలోకి ఇంకుపోయేలా చేస్తాయి. దీనివల్ల పారిశుధ్యం మెరుగుపడుతుంది. దోమల బెడద, దుర్వాసన సమస్య ఉండదు.

**మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోందా ?**

ప్రస్తుతం ఈ నూతన విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేస్తున్నాం. అవి విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

**విశాఖ జిల్లాలో నిర్మాణం చేపట్టారా ?**

పైలెట్ ప్రాజెక్టుగా పద్మనాభం మండలం రెడ్డిపల్లి, పెందుర్తి మండలం ఎస్ఆర్.పురం గ్రామాలలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాం. ఇక్కడి ఫలితాలు ఆధారంగా మిగిలిన గ్రామాలలో మిగతా 2లో..

## మత్తుకు బానిసలై చిత్తు కావద్దు

▶ వార్త 5లో..

## పే రివిజన్ కమిషన్ త్వరగా వేయాలి

▶ వార్త 2లో..

## మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

▶ వార్త 7లో..

# విశాఖలో 'శంబాల' సందడి



సినిమా విశేషాలను వివరిస్తున్న హీరో ఆది

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** వెర్సటైల్ హీరో ఆది సాయికుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల' చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో భాగంగా విశాఖలో సందడి చేసింది. ఈ సందర్భంగా ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ ఈ నెల 25న విడుదల కానున్న ఈ చిత్రం ఏ ఒక్కరినీ నిరాశపర్చదని, అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. హీరో ప్రభాస్ రిలీజ్ చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయిందని తెలిపారు. కంటెంట్ బాగుంటేనే ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారని, ఈ డిఫరెంట్ కంటెంట్ మూవీని మీడియా, ఆడియన్స్ ఆదరించాలని కోరారు. హీరోయిన్ అర్చన అయ్యర్ మాట్లాడుతూ 'శంబాల' లాంటి అద్భుతమైన చిత్రంలో మంచి పాత్రను పోషించడం ఆనందంగా ఉందన్నారు. ఇంత గొప్ప క్యారెక్టర్‌ను తనను నమ్మి ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రం ఆదికి బ్లాక్ బస్టర్‌గా నిలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నటుడు ఇంద్రనీల్ ఈ సినిమా తనకు కమ్ బ్యాక్ మూవీ అవుతుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఇతర పాత్రల్లో స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారన్నారు. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

## అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

**- జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్**

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో అనధికార నిర్మాణాలను, అదనపు అంతస్తుల నిర్మాణాలను ఏ మాత్రమూ ఉపేక్షించేది లేదని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించి, టౌన్ ప్లానింగ్ విభాగం నిరంతర నిఘా ఉంచి కూల్చివేత కార్యక్రమాలు చేపడుతోందని ఆయన ఆదివారం తెలిపారు. ఇదిలా ఉండగా బిపిఎస్ (భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకం)లో అక్రమంగా నమోదు చేసుకునేందుకు పలువురు కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారని గుర్తించారు. వీటిపై కఠినంగా వ్యవహరిస్తూ టౌన్ ప్లానింగ్ విభాగం ఇప్పటికే కూల్చివేతలు ప్రారంభించింది. జోన్-4 పరిధిలోని 29వ వార్డు ప్రకాశరావుపేటలో ఒక భవనం మూడో అంతస్తు అనధికార నిర్మాణాన్ని, 31వ వార్డు చాకలిపేట, గాజువాక శ్రీనగర్‌లలోని అదనపు అనధికార అంతస్తులను గుర్తించి కూల్చివేవారు. ఈ విషయాన్ని కమిషనర్ ఆదివారం వెల్లడించారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడవద్దని భవన యజమానులను ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన (లేఅవుట్ రెగ్యులరైజేషన్ మిగతా 2లో..

## మంత్రి రామ్మోహన్ నాయుడు

# రాజీనామా చేయాలి

◆ విమానయాన సంక్షోభం పరిష్కారంలో ఆయన విఫలం

◆ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** దేశంలో నెలకొన్న విమానయాన రంగ సంక్షోభాన్ని పరిష్కరించడంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పూర్తిగా విఫలమయ్యారని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. విమానాల రద్దుతో లక్షలాది మంది ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు కేంద్ర మంత్రిత్వ శాఖే బాధ్యత వహించాలన్నారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, టిడిపి నేతల ప్రచారాన్ని తీవ్రంగా ఎండగట్టారు. విమానయాన చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది మంది మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**



గుర్రాల పార్కు ప్రతిపాదిత ప్రాంతంలోని నిర్మాణాలు

## గుర్రాల పార్కుకు సన్నాహాలు

ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది' అని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్, మాజీ ఐఎఎస్ అధికారి శర్మ వంటి వారు స్వయంగా ఇక్కడకు వచ్చి ఈ నిర్మాణాలపై వ్యతిరేకించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని నిత్యం జపిస్తున్న పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, కూటమిలో ఉన్న జనసేన కార్పొరేటర్లు దీనిపై ఎంతమేరకు స్పందిస్తారన్న విషయమై ఆసక్తి నెలకొంది. ఎక్కువ మంది పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉండే ఈ ప్రాంతంలో కేవలం ధనవంతుల ఆనందం కోసం, రాజకీయ ముడుపుల కోసం, కాంట్రాక్టర్ లాభాల కోసం వాటర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంలో ఇటువంటి ప్రాజెక్టులు చేపట్టడం ఎంతవరకు న్యాయమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గుర్రపు స్వారీ శిక్షణతో ఆగకుండా గుర్రపు స్వారీ జూదం కూడా నిర్వహిస్తే ఇక్కడ యువత పెడదోవ పట్టే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాజెక్టును వెనక్కి తీసుకోవాలని, ఇప్పటి వరకు దీనిపై జరిగిన నిర్మాణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

## మ్యాజిక్ డ్రెయిన్లతో మురుగుకు చెక్

కూడా నిర్మిస్తాం.

**నిర్మాణం తీరు తెన్నులు వివరిస్తారా ?**

మ్యాజిక్ డ్రెయిన్ కట్టాల్సిన ప్రాంతంలో 2 అడుగుల లోతు, 2 అడుగుల వెడల్పు కూడిన కాలువ తవ్వుతారు. వాటిలో 5 అంగుళాల మందం కలిగిన సిమెంట్ పలకలను కాలువకు రెండువైపులా దించుతారు. కాలువలో తొలి లేయర్‌లో ఒక అడుగు ఎత్తున 65 – 75 ఎంఎం గులకరాళ్లు వేస్తారు. దానిపై మరో 9 అంగుళాల ఎత్తు వరకు 400 ఎంఎం రాళ్లను, మూడో లేయర్‌గా వై భాగంలో 10 – 20 ఎటిఎం రాళ్లను వేసి పూడ్చేస్తారు. వాటికి ఇంటిలో వాడే గ్రే వాటర్, రెయిన్ వాటర్ కలిసేలా అనుసంధానం చేస్తారు. ఈ విధానంలో ప్రతి రెండేళ్లకోసారి పై భాగంలో వేసిన 10 – 20 ఎంఎం రాళ్లను తీసి మార్చాల్సి ఉంటుంది. అంతకు మించి ఎటువంటి ప్రయాసా ఉండదు.

## మంత్రి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి

ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ అమలు చేయడంతో తలెత్తిన పరిస్థితులను అంచనా వేయడంలో, పరిష్కరించడంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విఫలమయ్యారని దుయ్యబట్టారు. ప్రైవేటు సంస్థలకు కొమ్ముకాస్తూ, ఇష్టమొచ్చినట్లుగా టిక్కెట్ ధరలు పెంచిన విమానయాన సంస్థలను ఆయన అదుపు చేయలేకపోయారన్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే రూ.30 వేలు, ఢిల్లీకి రూ.50 వేలు ఛార్జ్ చేస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల భద్రతను పణంగా పెట్టి ఎఫ్‌డిటిఎల్ నిబంధనను వెనక్కి తీసుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జూన్‌లో జరిగిన విమాన ప్రమాదం నుంచి నేటి సంక్షోభం వరకు రీల్స్ చేయడం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ దొంగిలించడం తప్ప కేంద్రమంత్రి సాధించింది ఏమీ లేదని అమర్‌నాథ్ విమర్శించారు. విజయవాడ ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులపైనా ఆయనకు పట్టింపు లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన లక్షలాది మంది ప్రయాణికులకు తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. సంక్షోభాన్ని పరిష్కరించి, టిక్కెట్ ధరలను అదుపులోకి తీసుకురావాలన్నారు.

**ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలి**

విశాఖ ఉక్కు కర్మాగారంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 9500 మంది ఉద్యోగులను తొలగించి, 42 విభాగాలను ప్రైవేటుపరం చేస్తున్నారని అమర్‌నాథ్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర మంత్రి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

స్కీమ్), బిపిఎస్ (బిల్డింగ్ పానలైజేషన్ స్కీం) పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2025 ఆగస్టు 31 లోపున నిర్మించిన అనధికార నిర్మాణాలు, అదనపు అంతస్తుల యజమానులు మాత్రమే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆగస్టు 31 తర్వాత నిర్మించిన నిర్మాణాలు లేదా ప్రస్తుతం జరుగుతున్న అనధికార కట్టడాలు బిపిఎస్ పథకంలోనికి వర్తించవని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకాలపై సందేహాలు నివృత్తి చేయడానికి క్రమబద్ధీకరణ ప్రక్రియలో సహాయం అందించడానికి జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 9154282649, 9154282654గా ఉన్నాయన్నారు. అక్రమ నిర్మాణాల సమాచారం కోసం, నగరంలో అనధికార కట్టడాలు జరుగుతుంటే ప్రజలు జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు. నిర్ణీత గడువులోగా క్రమబద్ధీకరణ ప్రక్రియకు ముందుకు రావాలని కమిషనర్ భవన యజమానులకు విజ్ఞప్తి చేశారు.

# పే రివిజన్ కమిషన్ త్వరగా వేయాలి

**ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను లెక్కగట్టి ముందుగా సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆ బకాయిలకు బదులుగా ప్రభుత్వ భూమిని ఉద్యోగులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయ భవనం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేందిరప్రసాద్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ ఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్‌కుమార్ హాజరయ్యారు.

రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ మాట్లాడుతూ,12 వ పే రివిజన్ కమిషన్ ముగ్గురు సభ్యులతో త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ లోగా ఐఆర్ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.

## పోలీసులకు ట్రాఫిక్ బారికేడ్లు అందజేత

**ప్రజాశక్తి– ఎంవిపి కాలనీ:** మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ యాజమాన్యం ట్రాఫిక్ పోలీసులకు కొత్తగా రూపొందించిన బారికేడ్లు అందజేసింది. ఆదివారం హాస్పటల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి ప్రవీణ్‌కుమార్‌కు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని సీనియర్ జనరల్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ట్రాఫిక్ బారికేడ్లను అందజేశారు. ఈ బారికేడ్లు అధిక రద్దీ ఉన్న ప్రాంతాలలో ట్రాఫిక్‌ను నియంత్రి ంచడంలో తోడ్పడతాయన్నారు.

# చిత్తశుద్ధితో పనులు చేయాలి




రాత్రి వేళ విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

**జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్**
**పారిశుధ్య పనుల ఆకస్మిక పరిశీలన**

**ప్రజాశక్తి– ఎంవిపి.కాలనీ:** చిత్తశుద్ధితో పనులు నిర్వహించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్–3,4 పరిధి ఆర్‌టిసి కాంప్లెక్స్, సిరిపురం, సత్యం జంక్షన్, సీతమ్మధర, డైమండ్ పార్క్ తదితర ప్రాంతాల్లో కేతన్‌గార్గ్ శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ పట్టుదల, నిబద్ధత, చిత్తశుద్ధితో విధులను నిర్వర్తించాలని సూచించారు. రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేయడం, నగర సుందరీకరణ కాపాడటంలో అత్యంత కీలకమైనదని కమిషనర్ వెల్లడించారు.

నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, అందంగా ఉండేలా బాధ్యతతో పనిచేయాలని పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ సూచించారు. కమర్షియల్ ప్రాంతాల్లో చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్ నిబంధనల అమలు పర్యవేక్షణను కమిషనర్ సమీక్షించారు. వ్యాపార సముదాయాల నుండి చెత్త సేకరణ, సమయానికి వ్యర్ధాలను తొలగించడం, రాత్రి సమయంలో శుభ్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

# ఎండాడలో సామాజిక భవనం నిర్మించాలి

**ప్రజాశక్తి–విశాఖ కలెక్టరేట్ :** ఎండాడలో గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో యాదవ సామాజిక తరగతి భవనాన్ని నిర్మించాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షులు ఆల్సి అప్పల నారాయణయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడు తూ, ఎండాడలో కాకుండా ముడసర్లోవ ప్రాంతంలో యాదవ సామాజిక భవనం నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించడం సరికాదన్నారు. ఎండాడ జాతీయ రహదారిలో ఉందని, విశాఖ, అనకాపల్లి ప్రాంతాలతో పాటు విజయనగరం వగైరా జిల్లాలకు కూడా ఈ స్థలం అందుబాటులో ఉంటుంద న్నారు. ప్రస్తుతం యాదవ సామాజికవర్గం శాసనసభ్యులుగా ఉన్న పల్లా శ్రీనివాసరావు, సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ దీనికోసం కృషి చేయాలన్నారు. జివిఎంసిలో ఉన్న యాదవ సామాజిక తరగతికి చెందిన 28 మంది కార్పొరేటర్లు దీనికి సహకరించాలన్నారు. ఎండాడలో యాదవ భవనం నిర్మాణం కోసం ఒక్కొక్క చదరపు గజానికి రూ.2500 చొప్పున వసూలు చేశారని, ఈ విధంగా వసూలు చేసిన లక్షలాది రూపాయలు ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖ జిల్లా యాదవ సంఘానికి అధ్యక్షులుగా ఎంతోమంది పనిచేశారని, వారిలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఉన్నారన్నారు. ఎండాడ యాదవ భవనాన్ని రద్దు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముడసర్లోవ వద్ద యాదవ భవనం నిర్మాణానికి ఇచ్చిన జిఒ 475ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ యాదవ ఐక్యవేదిక ఉపాధ్యక్షులు అల్లు రమణారావు, కార్యదర్శి పల్లా వెంకట అప్పారావు, ప్రచార కార్యదర్శి నక్క సాంబశివరావు, విశాఖపట్నం యాదవ సంఘం కార్యదర్శి పాత్రపల్లి వెంకట నరసింహమూర్తి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి – విఆర్‌పురం:** రేఖపల్లి ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ మండల కౌన్సిల్ ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య, యు.వెంకట నారాయణ, కన్నారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని ఆక్షేపించారు. ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేసారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు.



# 9,10 తేదీల్లో ఢిల్లీలో పెన్షనర్ల ధర్నా

**విశాఖ నుంచి పలువురు పయనం**

**ప్రజాశక్తి– విశాఖ కలెక్టరేట్ :** పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ధర్నా, జాతీయ సదస్సు కార్యక్రమాలకు ఆదివారం విశాఖపట్నం నుంచి 40 మంది పెన్షనర్లు బయలుదేరి వెళ్లారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరంతా బయలుదేరి వెళ్లారు. వీరితో పాటు ఢిల్లీ వెళ్లిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, దీనికి డిఎ అదనంగా కలిపి ఇవ్వాలన్నారు. పెన్షనర్లు అందరి పెన్షన్ అధికం చేయాలన్నారు. పెన్షనర్లకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. సీనియర్ సిటజన్లకు రైల్వే రాయితీ కల్పించాలన్నారు. అధిక పింఛను కోసం డిపాజిట్ చేసే సమయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. పెన్షన్ వ్యాలిడేషన్ బిల్లు 2025 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఈ నెల 9న జాతీయస్థాయిలో ధర్నా ఉంటుందన్నారు. 10వ తేదీన జాతీయ సదస్సు ఉంటుందన్నారు. సదస్సులో పెన్షనర్ల సంఘం జాతీయ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. ఎపి నుండి అధిక సంఖ్యలో పెన్షనర్లు తమతో పాటు వివిధ స్టేషన్లో ఢిల్లీ వచ్చేందుకు చేరుతారని ఈ సందర్భంగా తెలిపారు.

## పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

**ప్రజాశక్తి–సీలేరు:** పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిం చరాదని ఎస్ఐ యాసీన్ హెచ్చరించారు. ఆటోడ్రైవర్లతో ఆదివారం సమా వేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఆటో డ్రైవర్‌కు లైసెన్స్‌తో పాటు ఇతర పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాన్ని నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు.

# 'రాజీవ్ గృహకల్ప'లో మౌలిక వసతులేవీ?

- ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పొదలు
- పాము, పుట్ర వస్తుందని స్థానికుల భయాందోళన



పెచ్చులూడుతున్న భవనం



ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పొదలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి 3వ వార్డు పరిధి నేరెళ్లవలస కాలనీలో 2004 - 09 మధ్య కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఒక బ్లాక్ లో 12 ఇళ్లు చొప్పున 22 బ్లాక్‌లతో 528 ఇళ్లు నిర్మించారు. ఇప్పటికి 45 కుటుంబాలు మాత్రమే ఇక్కడ నివాసముంటున్నాయి. మౌలిక సదుపాయాలు లేక పోవడంతో లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఇక్కడ ఉండేందుకు ఆశక్తి చూపడం లేదు. వినతులు, విజ్ఞప్తుల మేరకు ఎక్కువ శాతం బ్లాకుల్లో నివసిస్తున్న కుటుంబాలకు జివిఎంసి ఒకటో జోన్ అధికారులు తాగు నీటి సదుపాయం కల్పించారు. ఒక బ్లాక్ లో ఉన్న 12 ఇళ్లకు తాగు నీరు అందించేందుకు వీలుగా ఒక్కో బ్లాక్‌పై 500 లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు.

**ఏపుగా పెరిగిన పొదలు**

ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పొదలతో రాత్రి వేళ పాము, పుట్ర వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఒకటి, రెండు చోట్ల వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. మరికొన్ని ఇళ్ల శిథిలావస్థకు చేరుకున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఇంటి పెచ్చులు ఊడిపోతున్నాయి



ఇంటి పెచ్చులు ఊడిపోతున్నాయి. తుపాన్లు, భారీ వర్షాలు వస్తే భయం వేస్తోంది.

**వెంకట రమణమ్మ**
**14వ బ్లాక్**

### పొదలు తొలగించాలి



ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పొదలతో రాత్రి వేళ పురుగు, పుట్ర, పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. దీంతో భయంగా ఉంది

**ధనుష్**
**3వ బ్లాక్**

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**భీమునిపట్నం :** మండలంలో కేటాయించిన 3 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ 1, 2 లు ఎం.శివరాణి, ఎ.జయప్రద తెలిపారు. 573 మంది విద్యార్థులకుగాను 549 మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. జివిఎంసి మూడో వార్డు పరిధిలో ఉన్న పిఎన్ఎం హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ పరీక్షాకేంద్రాల్లో పరీక్ష జరిగినట్లు వివరించారు.

**తగరపువలస :** చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. సక్రమంగా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. టెన్త్ క్లాస్ స్టడీ అవర్ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 100 రోజులు యాక్షన్ ప్లాన్‌ను విద్యార్థులు సక్రంగా ఉపయోగించుకోవాలని సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణకు చెప్పారు.

## నివాసితుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి మూడో వార్డు పరిధి నేరెళ్లవలసలో ఉన్న సేఫ్ హార్బర్ హౌసింగ్ కాలనీ నివాసితుల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైనట్లు సంఘం కార్యదర్శి ఎం.జగన్మోహన్‌నాయుడు తెలిపారు. అధ్యక్షులుగా ఎన్.రవీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా కె.రామచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.అప్పలనాయుడు, ఎస్.సునీల్‌కుమార్, కోశాధికారిగా ఎన్.బలరామ్, ఎగ్జిక్యూటివ్, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా మరికొందరు ఎన్నికైనట్లు జగన్మోహన్ నాయుడు తెలిపారు. తమ కాలనీలో ప్రధానంగా ఎస్సి, ఎస్టి, బిసి కుటుంబాలు ఉంటున్నాయని, కాలనీ అభివృద్ధికి తమ కార్యవర్గం కృషిచేస్తుందని చెప్పారు. తాగునీటి సదుపాయం, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు మరింత మెరుగ్గా ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.

# సౌకర్యాల లేమితో నిరుపయోగం

- ఆరోగ్య కేంద్ర భవన కేంద్రాన్ని ఖాళీ చేసిన సిబ్బంది
- ప్రజలకు దూరమైన వైద్యసేవలు.. పట్టని అధికారులు



నిరుపయోగంగా మారిన ఆరోగ్యకేంద్ర భవనం

**ప్రజాశక్తి పద్మనాభం:** కనీస సౌకర్యాలు లేని కారణంగా మండల కేంద్రం పద్మనాభంలోని ఆరోగ్య కేంద్ర భవనాన్ని వైద్య సిబ్బంది రెండు నెలల క్రితం ఖాళీ చేసేశారు. గ్రామ సచివాలయంలో ఆరోగ్యకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కాగా పద్మనాభంలోని ఆర్‌టిసి బస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఆరోగ్య కేంద్ర భవనాన్ని 2002 మే 5న అప్పటి అటవీ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ భవనాన్ని పంచాయతీ శాఖ నిధులతో నిర్మాణం చేపట్టారు అప్పటి ఎమ్మెల్యే ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు, ఎంపీ ఎంవివిఎస్ మూర్తి శంకుస్థాపన చేశారు. ఆర్‌టిసి బస్‌స్టేషన్ పక్కనే ఆరోగ్య కేంద్రం ఉన్నపుడు రోగులకు అందుబాటులో ఉండేది. అయితే ఇక్కడ భవనం బాగున్నప్పటికీ, అందులో కనీస సౌకర్యాల లేకపోవడంతో అందులో ఉండి పనిచేయడానికి వైద్యసిబ్బంది ముఖం చాటేశారు. ఏకంగా భవనాన్ని ఖాళీచేసి, సచివాలయంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆర్‌టిసి బస్‌స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న ఆరోగ్యకేంద్ర భవనాన్ని పరిశీలించి, అందులోని సమస్యలను చక్కదిద్ది, అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా వినియోగంలోకి తేవడంతోపాటు ప్రజలకు వైద్యసేవలు చేరువచేయాలని స్థానికులు కోరుకున్నారు.

## నేరాలు ఘోరాలు

### ఇద్దరిపై గంజాయి కేసు

**ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ :** యలమంచిలి పాత రైల్వేక్వార్టర్స్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే అందిన సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ సావిత్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గాజువాక జంక్షన్‌లో ఒక గుర్తుతెలియని సన్యాసి నుంచి గంజాయి కొనుగోలు చేసి తాగుతున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు ఎస్ఐ సావిత్రి తెలిపారు. ఈ మేరకు ఎలమంచిలి తులసీనగర్‌కు చెందిన సింగపల్లి రమణ, రాంనగర్‌కు చెందిన మాడుగుల విజయకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, 50గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

### అసభ్యకర నృత్యాలపై కేసు

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** మండలంలో గుండుపాలెం సమీపాన ఓ రిసార్ట్స్‌లో అసభ్యకర నృత్యాల ఘటనపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.పైడపునాయుడు తెలిపారు. వివరాలివి. ఈనెల ఒకటో తేదీనిరాత్రి సమయంలో రిసార్ట్స్‌లో అసభ్యకర నృత్యాలు అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా; బుచ్చయ్యపేటకు చెందిన ఆర్గనైజర్‌తోపాటు చీడికాడ మండలం బైలపూడిక చెందిన ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలను అదుపులో తీసుకున్నామన్నారు. డాన్స్ ప్రోగ్రాం పేరుతో అనకాపల్లి నుంచి పిలిపించి రిసార్ట్స్‌లో అసభ్యకర కార్యక్రమాలు చేయించినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఏడుగురు పురుషులను ఒక ఆర్గనైజరును ఆదివారం అరెస్టు చేసి చోడవరం కోర్టు తరలించామని సీఐ తెలిపారు. మహిళలను మభ్యపెట్టి, వారితో అనైతిక కార్యక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. ఇలాంటి ఘటనపై ప్రజలు నిర్భయంగా తమకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

### కోడి పందేల శిబిరంపై దాడి

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలో నర్సింగిబిల్లి గ్రామం పరిధిలో అక్రమంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కశింకోట పోలీసులు దాడి చేశారు. 8 మంది నిర్వాహకులను అరెస్టు చేసి, వారి నుండి రెండు కోళ్లు, రూ.650 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ స్వామి నాయడు ఆదివారం తెలిపారు, ఎస్ఐ మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బందితో దాడి చేయగ, కోడిపందేలు ఆడుతున్న వారిని పట్టుకున్నారని తెలిపారు. కోడిపందేలు ఆడడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం నేరమని, నిందితులు ఎంతటి వారైనా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అన్నదానం

**ప్రజాశక్తి- తగరపువలస :** భీమునిపట్నం మండలం బోడ మెట్టపాలెం పంచాయతీలో అయ్యప్ప భక్తుల ఇరుముడి సందర్భంగా జనసేన ప్రెసిడెంట్ వారధి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల నాగ సందీప్ ప్రారంభించారు. దాకమర్రి, గద్దపేట పరిసర గ్రామాల ప్రజలు అన్న ప్రసాదం స్వీకరించారు.

# విద్యతో క్రీడలనూ ప్రోత్సహించాలి

### విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

**ప్రజాశక్తి- ఆనందపురం :** విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభను అభివృద్ధి చేసుకునే ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖభ్రత బాగ్చి సూచించారు. ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ, నేలతేరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ సహకారంతో సుమారు రూ.కోటితో నూతనంగా ఏర్పాటుచేసిన లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలు, కమ్యూనిటీ హాల్‌ను పోలీసు కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం పెరుగుతుందని, శారీరక దృఢత్వం వస్తుందని చెప్పారు అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, లాంగ్‌జంప్ మైదానం, లైబ్రరీ గది, మెడికల్ క్యాంప్ స్టాళ్లను ప్రారంభించారు. ముందుగా మదర్ థెరీసా, కస్తూర్బా విగ్రహాలకు పూలమాలలు వేశారు.

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాల స్కూళ్లతో పోటీ పడే స్థాయికి కెజిబివిలు రావాలన్నారు. భీమిలి నియోజకవర్గంలోని ప్రతి కెజిబివినీ దత్తత తీసుకునే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘట్టమనేని సుబాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, కెజిబివిని దత్తత తీసుకొని దేశంలోనే నంబర్ వన్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హైజంప్, వాలీబాల్, టెన్నిస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిఇఒ ప్రేమకుమార్, సమగ్ర శిక్షా ఇపిసి డాక్టర్ జోగి చంద్రశేఖరరావు, సిఐ వాసునాయుడు, ఎస్ఐ సంతోష్, ఆనందపురం ఎంఇఒలు జోగేంద్రనాథ్, గంగరాజు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, బంగారాజు, దేవుడుబాబు, వైస్‌చైర్మన్ మంగా అప్పన్న, సభ్యులు దేవుడు, కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగమణి, తాత్రాజు అప్పారావు బిఆర్‌బి నాయుడు, లోడగల రమణ తదితరులు పాల్గొన్నారు



కెజిబివిలో లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలను ప్రారంభిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

## ఆత్మరక్షణకు కరాటే దోహదం

### - సినీ నటుడు సుమన్

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సినీ నటుడు, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ తల్వార్ తెలిపారు. ఉక్కునగరం సీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వడోకాయ్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన కరాటే గ్రేడింగ్ బెల్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుమన్ తల్వార్, గౌరవ అతిథిగా కరణంరెడ్డి నరసింగరావు హాజరయ్యారు. పలువురు విద్యార్థులకు కరాటేలో వైట్, ఎల్లో, బ్లూ, గ్రీన్, బ్రౌన్, ఆరెంజ్, బ్లాక్ బెల్టులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా అధ్యక్షుడు సీనియర్ కోచ్ సతీష్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి అంబు, అతిథులు గూటూరు శంకరరావు, గంధం వెంకటరావు, ప్రగడ నాగేశ్వరరావు, కోచ్‌లు గోవర్ధన్, సరస్వతి, రాజేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అప్పన్నను దర్శించుకున్న విరాట్‌కోహ్లి

## అప్పన్నను దర్శించుకున్న విరాట్ కోహ్లి

**ప్రజాశక్తి- వేపగుంట :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లి, ఆయన కుటుంబ సభ్యులు, ఆసియా కప్ టీమిండియా మాజీ మేనేజర్ పి.వెంకటరామ్ ప్రశాంత్, టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, ఎసిఎ ప్రతినిధి విష్ణు దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వర్ రావు, పర్యవేక్షణాధికారి కంచి మూర్తి స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు.



మందులు అందజేస్తున్న టిడిపి నాయకులు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - ఆరిలోవ :** జివిఎంసి 11వ వార్డు ముస్తఫా కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సారథ్యంలో 11వ వార్డు తెలుగుదేశం నాయకులు, వి.జ్యూయలరీ మార్ట్ పార్టనర్ కాకి గంగరాజు ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు ప్రారంభించారు. శిబిరంలో 283 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముస్తఫా కాలనీలో శిబిరం ఏర్పాటుచేసినందుకు గంగరాజును ముస్లిం మత పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ముగడ రాజారావు, ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, జనసేన అధ్యక్షులు సారిపల్లి రాము, రామడుగు విక్రమ్, సీనియర్ నాయకులు మూది అప్పారావు, పేపర్ నాయుడు, ఎస్‌కె.కలిశా, బర్రి సూర్యనారాయణ, సిహెచ్.ఆదినారాయణరాజు, లింగం సత్యనారాయణ, బోయి శ్రీను పాల్గొన్నారు,

# సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి




పాత గాజువాకలో ఏర్పాటుచేసిన పైలాన్

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**గాజువాక :** సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతంచేయాలని యూనియన్ నాయకులు ఎం.రాంబాబు కోరారు. పాత గాజువాక జంక్షన్‌లో సిఐటియు మహాసభల పైలాన్‌ను ఆదివారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మహాసభకు గాజువాక కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జనవరి 4వ తేదీన నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభలో వేలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, రైల్వే వేగన్ వర్క్ షాప్ వర్కర్స్ అధ్యక్షులు కె.అవతారం, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఎం.నాగేశ్వరరావు, త్రినాధ్, రామకృష్ణ, దేవేంద్ర, సిఐటియు సుందరయ్య కాలనీ నాయకులు సంపంగి శ్రీను పాల్గొన్నారు.

**తగరపువలస :** సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తగరపువలస బంతాట మైదానంలో సిఐటియు భీమిలి జోన్ కమిటీ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన డప్పు కళాకారులు, కోలాట బృందాలు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, జనవరి 4వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, దల్లీ రాము పోతురాజు, రామకృష్ణ పాల్గొన్నారు.



తగరపువలసలో సాంస్కృతిక కార్యక్రమాల సందడి

# ట్రాఫిక్ నియంత్రణలో 'గాజువాక పోలీస్ సోల్జర్స్'

**ప్రజాశక్తి -గాజువాక :** గాజువాక ట్రాఫిక్ నియంత్రణలో గాజువాక పోలీస్ సోల్జర్స్ వ్యవస్థ పనిచేస్తుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యాన గాజువాక పోలీస్ సోల్జర్స్ వ్యవస్థను విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గాజువాక ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఈ సందర్భంగా కొంత మంది సామాన్య పౌరులు ట్రాఫిక్ పోలీసులకు స్వచ్ఛంద సహకారంతో గాజువాక పోలీస్ సోల్జర్‌గా వచ్చి సర్వీస్ ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. గాజువాకలో వాహనాలు బాగా పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా రోడ్లు లేకపోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలు ఇచ్చే సూచనలు పోలీసులు స్వీకరిస్తారని తెలిపారు. దీనిపై వాయిస్ ఆఫ్ గాజువాక తరపున ప్రధాన కార్యదర్శి ఎస్‌వికె.పరశురాం పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ గంగవరం పోర్టు నుంచి వస్తున్న భారీ వాహనాలు జగ్గుజంక్షన్ నుంచి గాజువాక మీదుగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని, తీవ్ర కాలుష్యంతో ప్రజల అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ వాహనాలను వై.జంక్షన్ నుండి రెండవ కెబిఆర్ పక్కనుండి వడ్లపూడి హైవే మీదుగా శ్రీనగర్, ఆటోనగర్‌లో నుంచి మళ్లించాలని కోరారు. గాజువాక నుంచి లంకెలపాలెం వరకు హైవేకి రెండు వైపులా సర్వీసు రోడ్లు నిర్మించడం వల్ల ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు. శ్రీనగర్ కూడలిలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ గాజువాక చైర్మన్ టివి.నాగేశ్వరావు, గండ్రెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌వికె.పరశురాం

## ముందస్తుగా కెకె.రాజు పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు ముందస్తు పుట్టిన రోజు వేడుకలు 42వ వార్డు అధ్యక్షుడు బీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి. 42వ వార్డు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కెకె.రాజు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ప్రియదర్శిని హోమ్‌లో వృద్ధులకు భోజనం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పౌరగ్రంథాలయంలో కామెడీ షో

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన 'వినోదాల విందు'లో భాగంగా ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో అదివారం కామెడీ షో నిర్వహించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, రాగన్ నాయుడు, సూర్య మఠ్రాపు, పుషమి, జివి.లక్ష్మి, భానుప్రకాష్, రామానుజం గిరిజ, కామెడీ స్కిట్లను ప్రదర్శించారు. ముందుగా హరహర నృత్యనికేతన్ స్కూల్ గురువు అల్లు వెంకట రమణ, శిష్యులు కోటా అనన్య, ఉజ్వల, ఎం.శరణ్య శాస్త్రీయ నాట్య ప్రదర్శనలిచ్చారు. అనంతరం జపాన్, సబ్బువరానికి దారి, అడవర్స్ రిపోర్ట్, ఒక నెంబర్‌కు ఫోన్, జాయింట్ ఖాతా, ధర్మం, డాక్టర్-పేషెంట్, మాట వినలేదు, విగ్గు, వారం సెలవు స్కిట్లను ప్రదర్శించారు. అధితులు తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, బి.నాగరాజారావు బహుమతులు అందజేశారు.

## పూర్వవిద్యార్థుల సహకారం నిరుపమానం : ఎయు విసి

**ప్రజాశక్తి- విశాఖపట్నం :** ఎయు అభివృద్ధికి పూర్వవిద్యార్థులు అందిస్తున్న సహకారం నిరుపమానమని విసి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎయు ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం 11వ వార్షిక సర్వసభ్య సమావేశం-పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ వికాసానికి, మౌలిక వసతుల కల్పనకు పూర్వవిద్యార్థులు విలువైన సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థులు స్వయంగా హాస్టల్ భవన సదుపాయాన్ని కల్పించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఐవిఎన్ఎస్‌కె.విశ్వనాథరావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో తమ సంఘం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఫిబ్రవరి నాటికి హాస్టల్ భవనం మూడవ అంతస్తు పూర్తిచేసి వర్సిటీకి బహూకరిస్తామన్నారు.

# వేడుకగా పైసావాలా ప్రమోషన్



ప్రమోషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ నవీన్ తేజస్, పైడిరాజు

**ప్రజాశక్తి- ములగాడ :** అనురాజ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫైవ్ ఎలిమెంట్స్ క్రియేషన్స్, పిజె.దేవి క్రియేషన్స్ బ్యానర్లపై నిర్మితమైన పైసావాలా సినిమా ప్రమోషన్స్‌ను దాడి ఇనిస్టిస్టూట్‌లో వేడుకగా నిర్వహించారు. ముందుగా పైసా వాలా మూవీ టీమ్‌కు దాడి ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పైసావాలా యాక్టర్ కం ప్రొడ్యూసర్, డైరెక్టర్ నవీన్ తేజస్, పైడిరాజు మాట్లాడుతూ, ఈ సినిమాను ప్రేక్షకులను ఆకట్టుకునేలా నిర్మించినట్లు తెలిపారు. డబ్బు అనేది ఈ కాలంలో ఎంతమంది చేతులు మారి వెళ్తుందో అనే కాన్సెప్ట్‌పై ఈ సినిమా నిర్మాణం జరిగిందని వివరించారు. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ డిసెంబర్ 12వ తేదీన థియేటర్లో చూసి తమను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పైసావాలా మూవీ ట్రయలర్‌ను వేశారు. ఈ సందర్భంగా పైసావాలా పాకెట్ కేలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైసా వాలా మూవీ టీమ్ కో డైరెక్టర్ పిఎస్ఎన్.రాజు, హీరోయిన్లు సంజన, అనూష, సంజు బేబీ, ఇంకోటి నాని, నీమేష్, కె.మంగ, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి 3వ వార్డుకు చెందిన పి.శ్రీనివాసరావు కోవిడ్ సమయంలో మృతి చెందిన నేపథ్యంలో ఆమె తల్లికి వైద్య అవసరాల నిమిత్తం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. తోటి స్నేహితుడు శ్రీనివాసరావు మృతిని ఇప్పటికీ జీర్ణించుకోలేని ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అతని తల్లి ఆరోగ్యం బాగాలేదని తెలిసి కుమార్తె రాజ్యలక్ష్మికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు కాళ్ల సన్నీ, మొకర శ్రీరామ్, ఎం.సూర్యశ్రీనివాస్, జి.సాయి తదితరులు పాల్గొన్నారు.



రాజ్యలక్ష్మికి సాయం అందజేస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

# మత్తుకు బానిసలై చిత్తు కావద్దు




మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి

**ప్రజాశక్తి. -అనకాపల్లి :** గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి కోరారు. ఆదివారం . అనకాపల్లి గవరపాలెం పార్క్ సెంటర్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఆరోగ్యమే మహా భాగ్యం సంస్థ ఆధ్వర్యంలో సమావేశంలో మాట్లాడారు. నేటిసమాజంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతుండడంతో యువత, విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. యువతను పెడమార్గంలో పెట్టించి , కుటుంబాల పతనానికి కారణం అవుతుందన్నారు. ఆదాయమే పరమావధిగా ప్రభుత్వమే విచ్చలవిడిగా మద్యం దుకాణాలు తెరుస్తూ, వాటి అమ్మకాలు, వినియోగాన్ని ప్రోత్సాహించడం దారుణమన్నారు.

గొర్రెలు మేకలు పెంపకం దారుల సహకార సొసైటీ, విశాఖ జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరాం మాట్లాడుతూ మత్తు పదార్థాల విచ్చలవిడితనం వల్ల సమాజంలో నైతిక విలువలు తగ్గి, దౌర్జన్యాలు పెచ్చరిల్లిపోతోం దన్నారు. ప్రజలందరూ జాగ్రత్తగా పరిశీలించి వాటిని దూరం ఉండాలని కోరారు. భోగ లింగేశ్వర దేవస్థాన చైర్మన్ మాట్లాడుతూ మత్తు అనర్థాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. యల్లయ్య కాలువ కమిటీ అధ్యక్షులు బుద్ధ మహాలక్ష్మి నాయుడు, సంస్థ కార్యనిర్వాహకులు పెంటకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాలు వాడకం ప్రమాదకరమన్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేసి, వాటి ఉత్పత్తి, అమ్మకాలను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో 80 వార్డు ప్రజా నాయకులు కొణతాల భాస్కరరావు, సంతోషిమాత గుడి మాజీ చైర్మన్ దాడి వాసు, మద్దాల శ్రీనివాసరావు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు మల్ల చంద్రశేఖర్, మెడిటేటర్ సూర్యనారాయణ, అనకాపల్లి కార్యదర్శి కోరాడ అప్పలరాజు, సీనియర్ సిటిజన్ సంస్థ అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు, శివప్రసాద్, రైతు సంఘం నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, కార్మిక నాయకులు శ్రీనివాస్, ఎం వి సత్యనారాయణ, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఘంటసాలకు ఘననివాళి



గాయకులను అభినందిస్తున్న మాజీ ఎంపీ చలపతిరావు

**ప్రజాశక్తి యలమంచిలి టౌన్:** పట్టణంలోని ఘంటసాల కళాక్షేత్రంలో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని ఘనంగా నిర్వమించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ తానూ ఘంటసాల అభిమానినేన్నారు. పాటలు పాడడమంటే తనకెంతో ఇష్టమని, తానూ గాయకుడినేని వెల్లడిస్తూ, స్టేజ్‌పై పాట పాడి అలరించారు.. యలమంచిలిలో ఘంటసాల ఆడిటోరియం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత పాటల పోటీలను ప్రారంభించగా, ఔత్సాహిక గాయనీగాయకులకు పాటలు పాడి అలరించారు సాయంత్రం నిర్వహించిన సంగీత విభావరిలో విజేతలకు మాజీ ఎంపీ పప్పల చలపతి రావు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో ఆడారి జగన్నాధం మాస్టర్, బొద్దపు శ్రీనివాసరావు, నాయకులు, అసోసియేషన్ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు లతిక్



లతిక్‌కుమార్

**ప్రజాశక్తి-అనకాపల్లి :** స్థానిక జివిఎంసి మెయిన్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి లతిక్ కుమార్ ఈనెల ఏడు నుంచి తొమ్మిది వరకు నరసరావుపేటలో జరుగు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా లతిక్ కుమార్‌ను హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌వి నరసింహంలను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.

## క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం



క్రికెట్ పిచ్ ప్రారంభిస్తున్న వెంకటరావు

**ప్రజాశక్తి -సబ్బవరం :** గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత, బిజెపి నేత చొక్కాకుల వెంకటరావు అన్నారు. ఆదివారం మండలంలోని అంతకాపల్లి పంచాయితీ ఒమ్మివానిపాలెం యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పిచ్‌ను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా యువకులు శారీరక, మానసిక ధృఢత్వం కలిగి ఆరోగ్యకరమైన జీవితం గడపటానికి దోహదపడతాయని తెలిపారు. యువత చెడు మార్గం పడకుండా క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ క్రీడాకారులు తమ నైపుణ్యాలను పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంతకాపల్లి ఎంపిటిసి చొక్కాకుల గోవింద, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు, సబ్బవరపు మోహనకృష్ణం నాయుడు, జనసేన నాయకులు సబ్బవరపు రమణ, సబ్బవరపు మనోహర్‌గాంధీ, చీపురు పల్లి నాయుడు, కిల్లి సూర్యనారాయణ, రొంగలి వెంకట రావు, పల్లా రమణ, కారుకొండ మోహన్, కారుకొండ పైడం, గొంప దేముడుబాబు, బర్ల బాబి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి




మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి


**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** ఉపాధ్యాయులు, విద్యా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం అచ్చుతాపురంలో యుటిఎఫ్ మండల శాఖ సమావేశంలో శ్రీలక్ష్మి మాట్లాడుతూ గడచిన 50ఏళ్లల్లో ఏనాడూ లేని విపత్కర పరిస్థితులను నేడు ఉపాధ్యాయులు ఎదుర్కోవాల్సి వస్తుందని, పిఆర్‌సి కమిషన్ వేయడానికి ప్రస్తుత పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయులకు వేలాది కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధనేతర బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకను మినహాయించాలని, దీనిపై పోరాటం చేస్తున్నా ప్రభుత్వ తీరు మారడంల లేదన్నారు.

### మండల కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా ఎన్నికల అధికారిగా శ్రీలక్ష్మి, ఎన్నికల పరిశీలకులుగా జిఎస్ ప్రకాష్ వ్యవహరించగా, మండల కమిటీ ఎన్నికల నిర్వహించారు యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆర్ రవికుమార్, మాత సూర్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా మారిశెట్టి వెంకట అప్పారావు, ఉపాధ్యక్షులుగా వియ్యపు అరుణ, గణేష్ కుమార్, కోశాధికారిగా కడలి పారిజాతం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పీటర్ పాల్, మండల కార్యదర్శిగా కమల సుభాషిణి, కృష్ణకుమారి టిఎ.సత్యనారాయణ, హిమశ్రీ, ఉత్తమ్ కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా ఉప్పాడ రాము, సలీం, కేశవ, నీరజ రవి రాజు ఎన్నికయ్యారు.

## చక్కని చదువుతో భవిష్యత్తును చక్కదిద్దుకోండి

- కైట్స్ కాలేజీ ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



ప్రతిభా ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** సెజ్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం అచ్యుతాపురం కైట్స్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో చెందుతుందన్నారు. వందలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, పరిశ్రమల రాకతో వేలాదిమంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. . ప్రతి విద్యార్థి అంకితభావంతో చదివి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు.

కార్యక్రమంలో పరవాడ డిఎస్.పి విష్ణు స్వరూప్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, దురాలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. చదువుతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరగలరన్నారు. బాలికలను వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కైట్స్ కాలేజీ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ ఏటా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నా మన్నారు.విద్యార్థులు చదువులో పోటీపడి కళాశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అచ్యుతాపురం సిఐ సిహెచ్ చంద్రశేఖర రావు, కైట్స్ విద్యామెహార్ స్కూల్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, అచ్చుతాపురం సర్పంచ్ కె విమలా నాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, కళాశాల డైరెక్టర్లు విల్లూరి ప్రసాద్ , అడిగర్ల శంకరరావు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి వితరణ



భూమి పత్రాలు అందజేస్తున్న దాతలు

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:** మండలంలో కెపి అగ్రహారం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిని గ్రామానికి చెందిన వియ్యపు ముసలి కుమారులు వియ్యపు రాజబాబు, వియ్యపు అప్పారావు అందజేశారు. ఆదివారం భూమి సంబంధించిన పత్రాలను విరాళంగా స్థానిక నాయకులు మండల ఎంపిటిసిల ఫోరమ్ అధ్యక్షులు దేవర అప్పారావు, గ్రామ టిడిపి అధ్యక్షులు అడ్డూరి శ్రీను కోఆపరేటివ్ డైరెక్టర్ మల్లి ఈశ్వరరావులకు అందజేశారు. ఆలయానికి భూవిరాళ దాతలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వియ్యపు గణేష్, గొలగాని సోమనాయుడు, గొలగాని అప్పారావు, వియ్యపు ముసలి నాయుడు, బొబ్బిలి రవీంద్ర, బొబ్బిలి జనార్ధన, గోపిశెట్టి శ్రీను, ముచ్చకర్ల సూరిబాబు పాల్గొన్నారు.

## రైతుబజార్ ఏర్పాటు చేయాలని దీక్ష



తొమ్మిదో రోజు దీక్షలో పాల్గొన్న ఆప్ నేతలు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ సెంటర్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ రైతు బజార్ లేకపోవడంతో అటు కూరగాయలు పండించే రైతులతోపాటు తాజా కూరగాయాలు తక్కువ ధరకు దొరుకుతాయన్న ఆశపడే వినియోగదారులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. రైతు కుటుంబాలకు తగు ప్రోత్సాహం అందకపోతే, భవిష్యత్‌లో వారు సాగుకు దూరమయ్యే పరిస్థితులు ఉత్పన్నమౌతాయని హెచ్చరించారు. స్థానిక కూటమి నాయకులు, సంబంధిత అధికారులు చొరత తీసుకుని రైతు బజార్ పనులు తొందరగా పూర్తి చేయించి, వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని హరినాథ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కాతొమ్మిదవ రోజు దీక్షలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు అట్ల పోయిన నారాయణరావు, ఎం విజయ్, శంకర్రావు, గొర్లి వెంకటేశ్వరరావు, ఎస్ ప్రకాష్ కూర్చున్నారు.

## పొగమంచుతో పరేషాన్



దట్టంగా కురుస్తున్న పొగ మంచు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:** మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తుంది. తెల్లవారుజామున 4 గంటల నుండి పొగ మంచు కమ్ముకోవడంతో దగ్గరలోని వస్తువులు, వాహనాలు కూడా కానరాని పరిస్థితుల్లో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.. మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీగా పొగ మంచు కురిసింది.

విపరీతంగా చలి వేస్తున్నడంతో ప్రజల ఉదయం ఏడు గంటల వరకు బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు చలి, మరొకవైపు పొగమంచుతో రైతుల ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచుతో ఉదయ భానుడు ఉదయం ఏడు గంటల వరకు కనిపించడం లేదు..

# అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

- బిల్లులు చెల్లించక నిలిచిపోయిన నిర్మాణం
- చిన్నారులు, లబ్ధిదారులకు తప్పని వసతి కష్టాలు
- ప్రభుత్వం మార్పుతో నిరాదరణకు గురైన భవనం



ప్రారంభానికి ముందే శిథిలావస్థలో అసంపూర్తి అంగన్వాడీ భవనం

ప్రజాశక్తి- దేవరాపల్లి : అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వం మార్పుతో నిధుల విడుదలలో జాప్యం కారణంగా అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులకు కష్టాలను తెచ్చే నిలయాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడి అంగన్వాడీ కేంద్రం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలంలోని బేతపూడి అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో రైవాడ సమీపంలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలోని బేతపూడి, రైవాడ కాలనీ, జగనన్న కాలనీలకు చెందిన చిన్నపిల్లలు ప్రతిరోజూ నడక మార్గంలో కేంద్రానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బేతపూడి అంగన్వాడీ కేంద్రం వసతి కష్టాలను తీర్చేందుకు భవన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2014-19 కాలంలో నిధులు మంజూరు చేశారు. భవన నిర్మాణ పనులు 90శాతానికి పైగా పూర్తయిన తర్వాత ప్రభుత్వం మారడంతో, కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. దాదాపు పూర్తికావచ్చిన దశలో ఉన్న భవనాన్ని నేటికీ ఐసీడీఎస్ అధికారులకు అప్పగించలేదు. దీంతో భవనం అసంపూర్తిగా, తాళం వేసి ఉండటంతోపాటు ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఒకవైపు నూతన భవనం అసంపూర్తిగా ఉండగా, మరోవైపు బేతపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం ఒకటి ఖాళీగా, నిరుపయోగంగా ఉంది. విద్యార్థులు అంత దూరం నడుస్తూ ఇబ్బందులు పడుతున్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నా, ఖాళీగా ఉన్న ఈ ప్రభుత్వ భవనాన్ని తాత్కాలికంగానైనా అంగన్వాడీ కేంద్రం అవసరాల కోసం వినియోగించుకోవడానికి ఐసీడీఎస్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తిచేయకపోవడం, అందుబాటులో ఇతరత్రా భవనాలు ఉన్నా వాటిని వినియోగానికి చర్యలు తీసుకోకపోవడం వంటి చర్యలతో ప్రజాధనంతో నిర్మించిన అనేక భవనాలు నేటికీ నిరుపయోగంగానే ఉన్నాయని పలువురు మండిపడుతున్నారు. ప్రభుత్వ శాఖలు ఎవరికి వారే యమునాతీరే అనే రీతిన వ్యవహరించడం, సారూప్యత, అనుబంధ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వంటి కారణాలతో ఉన్న వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకోలేని స్థితిలో నిరుపయోగమయ్యే పరిస్థితి ఉందని పిల్లల తల్లిదండ్రులతోపాటు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా వెంటనే జోక్యం చేసుకుని, గతంలో టిడిపి ప్రభుత్వహయాంలో నిర్మాణం చేపట్టి, వైసిపి హయాంలో నిరాదరణకు గురై అసంపూర్తిగా ఆగిపోయిన అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయించి వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే సమయంలో పాఠశాలలో అదనంగా, నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఏదైనా అవసరాలకు వినియోగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతానికి ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న భవనంలోకి అంగన్వాడీ కేంద్రాన్ని మార్పుచేస్తే పిల్లల వసతి కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.

## వందేమాతరం గీతాలాపన




జాతీయజెండాలతో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో రేగుపాలెంలో డాక్టర్ వి చిట్టిబాబు సారథ్యంలో ప్రత్యేక సేవ శిబిరం కొనసాగుతోంది. ఆదివారం ఐదోరోజున వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, దేశభక్తిని పెంపొందించేలా గ్రామంలో అన్నివీధుల్లో వందేమాతర గీతాలాపన చేస్తూ దేశభక్తి భావాన్ని పెంపొందించేలా జాతీయజెండాలతో ర్యాలీ చేశారు. సోమవారం రేగుపాలెం సచివాలయం వద్ద విష్ణు డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చిట్టిబాబు తెలిపారు. ఈనెల 9వరకు ప్రత్యేక శిబిరం కొనసాగుతుందన్నారు.

## 98 మందికి ఉచిత కంటి పరీక్షలు




రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ గీతాంజలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని యర్రవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ డాక్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన 98మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో దృష్టిలోపం ఉన్న 16మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయగా, ప్రత్యేక వాహనంలో విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం విశాఖపట్నంలో ఆపరేషన్ అనంతరం తిరిగి ఇళ్ల వద్దకు చేరుస్తారనినిర్వాహకులు పిట్టా శ్రీనివాసరావు తెలిపారు కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ అరుణ్ కుమార్, పి దాసుబాబు, పిట్టా గోవింద, రమణ, వీసం గంగరాజు, దూళి అప్పలచిట్టి, టి దాసు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బోనాల పండగ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని యర్రవరం గ్రామంలో పరదేశమ్మ భవానీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సాహంగా జరిగింది. గ్రామంలో మహిళలు వివిధ రకాల పిండివంటలతో, పండ్లు, పువ్వులతో బోనాలు అలంకరించి ఊరేగింపుగా వెళ్లి, పరదేశమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరదేశమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

## రోడ్డు పక్కన చెత్తతో పరేషాన్

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో తీడకు వెళ్లే రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతూ, సమీప నివాసితులతోపాటు అటుగా వెళ్లే వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, ఇతరత్రా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా ఇక్కడి చెత్త చెదారాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు పక్కన చెత్తతో క్షీణించిన పారిశుధ్యంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా, గ్రామపంచాయతీ, సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి కన్నూరుపాలెంలో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

## యాదవ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా వెంకటరావు



వెంకటరావును సత్కరిస్తున్న యాదవ సంఘ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘ కన్వీనర్‌గా ప్రస్తుత అధ్యక్షుడు బొట్ట వెంకటరావును నియమిస్తూ సంఘసమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం పట్టణంలోని గొల్ల వీధి రామాలయంలో యాదవ సంక్షేమ సంఘ సమావేశం మాజీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా చిన్ని యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుతం నియోజకవర్గ అధ్యక్షులు బోడి వెంకట్రావు పదవి కాలం ముగియడంతో తదుపరి కార్యవర్గం ఏర్పాటయ్యేవరకు నియోజకవర్గ కన్వీనర్‌గా బోడి వెంకట్రావు కొనసాగాలని తీర్మానించారు. యాదవ సంఘం నాయకులు అయిత సన్యాసిరావు, బొట్టా ఆదినారాయణ, ఒమ్మి సన్యాసిరావు, పట్టణ అధ్యక్షులు బర్నికాన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజు, ఉపాధ్యక్షుడు కోన దుర్గాప్రసాద్, నాయకులు సరిపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు రేఖా రమణమూర్తి, కోరాడ మహేష్, వార్డు సభ్యుడుసికిరె నాగప్పారావు, కిల్లాడి నూకరాజు, కోన నరసింహమూర్తి, భర్నికాన నూకరాజు, మ్ముల్లి శ్రీనివాసరావు, బోడి శేఖర్, మ్ముల్లి అప్పారావు, ఎస్ శ్రీనివాసరావు, కోన అప్పారావు, ఇ.రాజేష్, పి నూకేష్, బి.నూరిబాబు, బి కొండలరావు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న బంగారి చిట్టి

ప్రజాశక్తి- యస్ రాయవరం. : మండలంలో రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాలలో యజ్జల మునిలమ్మ మూడవ వర్ధంతి సందర్భంగా మునిలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు బంగారి చిట్టి తెలిపారు. ఆదివారం దాత కుమారుడు యజ్జల బంగారు చిట్టి మాట్లాడుతూ చలికాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు చలి నుంచి రక్షణకు దుప్పట్లను అందజేసామన్నారు. మునిలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సామాజిక సేవ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవలను, బంగారు చిట్టిని గ్రామ పెద్దలు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కొడ లోవరాజు, గనగళ్ల మధు, దూడ నూకరాజు, గరికిన రమణ, గరికిన గోవిందు, గనగళ్ల శ్రీను, ఎరిపల్లి మునిలి, కంబాల అనీల్, చోడిపల్లి లోవరాజు, బత్తిన జగదీష్ పాల్గొన్నారు

## మార్టూరు రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం అయ్యప్ప స్వామి ఆలయం నుంచి వెదురువాడ ఎస్సీ కాలనీ మీదుగా మార్టూరు గ్రామం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఆదివారం గ్రామ సర్పంచ్ కేకే రమేష్ బాబు ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామపంచాయతీ జనరల్ నిధులు, సిఎస్ఆర్ నిధులతో రహదారిపై పడిన గుంతలను సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చివేశారు. రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లను చదును చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కెవి.రమణ, కెకెవిఎస్ రాజు హరిబాబు, గుర్రం గోవింద పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



దేవరాపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1997-98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. తెనుగుపూడి గురుకులం సమీపంలోని వెంచర్‌లో కలుసుకున్న మిత్రులంతా పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని, పరస్పర క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. బాల్యంలోని మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమ జీవితానికి మార్గదర్శనం చేసిన గురువులను ఆహ్వానించి, వారిని సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తర్వాత ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కలయిక స్నేహబంధాన్ని, పాత అనుబంధాలను మరింత బలోపేతం చేసి, పాతతరం స్ఫూర్తిని, విలువలను చాటిచెప్పిందని పూర్వ విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి గ్రామ దక్షిణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 1981-82 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. 43ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పరామర్శలు, పరస్పర ఆలింగనాలు, నాటి చిలిపి చేష్టలు, మధురస్మృతులను గుర్తుకు తెచ్చుకుని సందడి చేశారు. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2027 నాటికి 45ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్‌వి మహేష్, ఎల్లపు గోవింద, శరగడం జగ్గప్పారావు, పెంటకోట సూర్యనారాయణ, వెలగా కోటేశ్వరరావు, ప్రసాద్ కుమార్, మల్ల రామ జగన్నాథం, జివి రామారావు, పీవీఎస్ఎన్ రాజు, దాడి శ్రీనివాసరావు, మద్దుల రాజబాబు, దొడ్డి వెంకట రామారావు, బొడ్డేడ భరణి, బుద్ధ విశ్వనాథం, పంతులు నాయుడు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో సందడిగా పూర్వ విద్యార్థులు

# వరి కోతలు ఆరంభం

## మంచి దిగుబడులపై అన్నదాతల ఆశలు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**మండలంలో మునుపెన్నడూ లేని విధంగా రైతులు ఈ ఏడాది వరి సాగు చేశారు.ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి సాగు ఎంతో ఆశాజనకంగా ఉంది. అధిక దిగుబడి వచ్చే పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ రైతులకు ఈ ఏడాది పెట్టుబడుల భారం కూడా ఎక్కువైంది. వరి సాగు ఆరంభంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందినప్పటికీ, తదనంతరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో అన్నదాతల్లో ఆశలు చిగురింపజేశాయి.

మండలంలో మునుపెన్నడూ లేని విధంగా 5800 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసారు. గత ఏడాది 4535 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు సకాలంలో కురవక పోవడంతో వరి నాట్లు మందకొడిగా సాగాయి. ఆగస్టు నెలలో రైతులు



నక్కపల్లిలో పండిన వరి

వరి నాట్లు ప్రారంభించారు. ఆరంభంలో వర్షాలు ముఖం చాటేయడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకు వరి నాట్లు కొనసాగిస్తూనే ఉన్నారు. ఆగస్టు రెండవ వారంలో కురిసిన వర్షానికి వరి నాట్లు ఊపందుకున్నాయి. ఆగస్టు 18 నాటికి 1250 ఎకరాల్లోనూ, ఆగస్టు నెల ఆఖరికి 3200 ఎకరాల్లోనూ, సెప్టెంబర్ 15 నాటికి 4050 ఎకరాల్లోనూ, నెలాఖరికి 5800 ఎకరాల్లోనూ వరి నాట్లు పడ్డాయి.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ఆకు వేసే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో చాలామంది రైతులు వరి ఆకును కాపాడుకునే ందుకు అష్ట కష్టాలు పడ్డారు. బోరుల ద్వారా వరి మడులకు తడుపులు పెట్టుకుని వరి ఆకును రక్షించుకున్నారు. నీటి సదుపాయం లేని ప్రాంతంలో వరి ఆకు ఎండిపోయింది. అక్కడక్కడ వరి ఆకు ఎండిపోవడంతో, సంబంధిత రైతులు వరి ఆకును కొనుగోలు చేసుకుని వరి నాట్లు వేశారు. తెగుళ్ల వ్యాప్తి కూడా ఈ ఏడాది ఎక్కువగానే ఉంది. అనేకసార్లు తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయాల్సి వచ్చింది.అదేవిధంగా వర్షాలు సరైన సమయంలో కురవక పోవడంతో రైతులు వరి మడులకు అనేకసార్లు తడులు పెట్టాల్సి వచ్చింది. కూలీల ఖర్చుల భారం కూడా ఎక్కువైంది.

దీంతో, ఈ ఏడాది అధికంగా పెట్టుబడుల భారం అన్నదాతపై పడింది. వరి నాట్లు ఆరంభంలో వాతావరణం అనుకూలించక పోవడంతో రైతులు ఆందోళన చెందినప్పటికీ, ప్రస్తుతానికి వరి సాగు



బుచ్చయ్యపేట వరి పంటను కోస్తున్న మహిళలు

ఆశాజనకంగా ఉండడంతో మంచి దిగుబడులు వస్తాయని అన్నదాతలు ఆశిస్తున్నారు.

మొంథా, దిత్వా తుఫాన్‌ల ప్రభావం మండలంలో అంతగా లేక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో వరి కోత దశకు చేరుకుంది. ఇప్పటికే దోసలపాడు, గుల్లిపాడు గ్రామాల్లో అక్కడక్కడ వరి కోతలను ప్రారంభించారు. మరో పది, పదిహేను రోజుల్లో మిగిలిన ప్రాంతాల్లో కూడా కోతలు ప్రారంభం కానున్నాయి.

**బుచ్చయ్యపేట:** మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వడ్డాది, చిన్నప్పన్నపాలెం, దిబ్బడి, బుచ్చయ్యపేట కందిపూడి తదితర గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.. గత వారం రోజుల క్రితం తుఫాన్లు మూలంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండడంతో రైతులు వరి కోతలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉండడంతో చెరువుల్లో నీరు పుష్కలంగా చేరింది. మధుముల నుండి నీరు పారుతుండడంతో పంట పొలాల్లో నీరు చేరడంతో, పొలాలన్నీ బురద మయంగా ఉన్నాయి. బురదమైనటువంటి పొలాల్లో నే వరి కోతలు కోస్తున్నారు.

## ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులకు.. హయ్యర్ పెన్షన్ అమలు చేయాలి

-ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి వెంకట్రావు

**ప్రజాశక్తి-గొలుగొండ:**రోడ్డు రవాణా సంస్థలో పని చేసిన విశ్రాంత ఉద్యోగులకు అమలు చేస్తానన్న హయ్యర్ పెన్షన్ తక్షణం అమలు జరపాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి ఎ.వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలో సిహెచ్.ఎర్రవరం సమీపంలో ఉన్న అడవిరాజులుబాబు గుడి వద్ద ఆదివారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన కోశాధికారి ఎం జగ్గారావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్ట్ జడ్జిమెంట్ ఇచ్చినప్పటికీ పెన్షన్ అమలు చేయడంలో అలసత్వం వహిస్తుందన్నారు. ఉద్యోగులంతా హయ్యర్ పెన్షన్ కోసం డబ్బులు చెల్లించి ఏడాది కావస్తుందన్నారు. ఆలస్యమైన ఉద్యోగులకు అపరాధ రుసుముతో కలిపి చెల్లించారని తెలిపారు. ఇందుకోసం అసోసియేషన్లు పోరాడుతున్నప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం నిమిత్తం డబ్బులు చెల్లించి వైద్యం పొందుతున్న కార్మికులకు, 2020 తరువాత పదవీ విరమణ పొందిన వారికి కూడా వైద్య సేవలు అందించాలని కోరారు. రెండు ఏళ్ల క్రితం నుండి విశ్రాంత ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రవేశం లేకుండా చేశారని, వీటిని అమలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రావు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వెంకన్న ఆలయంలో పూజలు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఆదివారం లక్ష తులసి, లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి సన్నిధిలో లక్ష తులసి, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, పవన్, రంగబాబు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా, పక్కన ఎమ్మెల్సీలు

## డైట్‌లో భవన సముదాయానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక ప్రభుత్వ డైట్ ఆవరణలో డైట్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమంలో భాగంగా రూ.13.65 కోట్లతో నిర్మించనున్న నూతన భవన సముదాయానికి ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖజోన్- 1 ఆర్‌జెడి విజయభాస్కర్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు, ఎంఇఒ 1, 2లు ఎం.శివరాణి, ఎ.జయప్రద, సమగ్ర శిక్ష డిఇఇ నరసింహారావు, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, అర్థపాకల గుర్నాథరావు, టిడిపి మూడో వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు, నాయకులు కాసరపు ఎల్లాజీ, ఎస్.జోగారావు, కె.కామేష్ పాల్గొన్నారు.

# మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

**ప్రజాశక్తి-పాడేరు,పాడేరుటౌన్:**మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ప్రస్తుతం పిక్నిక్ సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి జనం మన్యంలోని పర్యాటక ప్రాంతాల బాట పట్టారు. దీంతో, ఆదివారం ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాలు కళకళలాడాయి.

ప్రస్తుతం వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడం, పిక్నిక్ సీజన్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అరకులోయకు, అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆదివారం ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల హడావిడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటక సందడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారీ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అరకులోయ, చింతపల్లిలో పర్యాటకులతో సందడి నెలకొంది.

### వంజంగి హిల్స్ కిటకిట

మండలంలోని వంజంగి మేఘాల కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. మేఘాల పర్వతాన్ని తిలకించేందుకు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది పర్యాటకులు శనివారం సాయంత్రానికి పాడేరుకు చేరుకొని ఇక్కడ బస చేశారు. కొందరు పాడేరు లాడ్జీల్లో కొందరు బస చేయగా.. మరికొందరు వంజంగిలో ఏర్పాటు చేసిన టెంట్లలో రాత్రి బస చేశారు. ఆదివారం వేకువ జామున మేఘాల పర్వతంపైకి పయనమయ్యారు. గత వారం రోజులుగా మంచు తీవ్రత అధికంగా ఉండడంతో పర్యాటకులు ప్రకృతి అందాలు, మేఘాల పర్వతంపై పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాల అందాలకు పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ పరవశించి పోయారు.



అరకులోయలో మ్యూజియం వద్ద పర్యాటకులు

### లంబసింగిలో పర్యాటకుల తాకిడి

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పర్యాటక సీజన్ కావడంతో లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. అత్యధిక సంఖ్యలో పర్యాటకులు స్థానికంగా బస చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మెజారిటీ పర్యాటకులు వ్యక్తిగత, సర్వీసు వాహనాల్లో ఉదయం ఐదు గంటలకు చేరుకుని సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణమయ్యారు. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు మంచు అందాలను తిలకిస్తూ పరవశించారు. ప్రకృతి అందాలను కెమెరాలో బంధించేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచి 11 గంటల వరకు లంబసింగి జంక్షన్, చేరువులవేనం వ్యూపాయింట్ పర్యాటకులతో సందడిగా కనిపించింది. లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు సాయంత్రం వరకు సందర్శకులతో రద్దీగా కనిపించాయి.



వంజంగిలో మేఘాలను వీక్షిస్తున్న పర్యాటకులు

### కొత్తపల్లి జలపాతంలో సందడి..

మండలంలోని ప్రముఖ కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో భారీ ఎత్తున పర్యాటకులు సందర్శించారు. ఉదయం నుంచి జలపాతంలో పర్యాటకుల తాకిడి నెలకొంది. రోజంతా జలపాతంలో సందడి చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు భారీగా తరలి రావడంతో జలపాతం కిక్కిరిసింది.

# 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధనకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయాలని డిఇఒ పెన్నాడ అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో ఆదివారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా నిర్వహిస్తున్న అదనపు తరగతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. సబ్జెక్టుల వారీగా చదువుతున్నప్పుడు సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని నివృతి చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. ప్రతీరోజూ ఒక సబ్జెక్టు పై రివిజన్ టెస్టులు ఉంటాయని, ఎప్పటికప్పుడు వాటిని దిద్ది లీప్ యాప్లో మార్కులను నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టుల వారీగా వెనకబడిన విద్యార్థులను గుర్తించి, ఆ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది అన్ని పాఠశాలల్లోనూ ఉత్తీర్ణతా శాతం పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పిల్లలను రైజింగ్ స్టార్, షైనింగ్ స్టార్లుగా విభజించి ప్రతీరోజూ వారిప్రగతిని అంచనా వేసి మంచి ఫలితాలు రాబట్టే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పరీక్షలు పూర్తి అయ్యేవరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతీరోజూ నిర్వహించే రివిజన్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అప్పారావు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి రుచి చూశారు. దేవవరం హైస్కూల్లో నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఎంఈఓ కే.నరేష్ పరిశీలించారు.

# విశాఖలో తొలి న్యూరో కేర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:విశాఖ వాసులకు అత్యుత్తమ న్యూరో సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన విఐఎన్ఎస్ (విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో సైన్సెస్) మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కెజిహెచ్ డౌన్లో దీన్ని ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలో మొట్టమొదటి సమగ్ర న్యూరో కేర్ సెంటర్ ఇదేనని నిర్వాహకులు తెలిపారు. ఈ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ను డిఎస్పి ప్రభాకర్, డాక్టర్ విద్యా రామ, డాక్టర్ సుబ్బారావు ప్రారంభించారు. న్యూరో హెల్త్కేర్ను ప్రోత్సహించేందుకు అంకితమైన ఈ కొత్త హాస్పిటల్లో పూర్తిగా అధునాతన సౌకర్యాలతో కూడిన ఎక్స్క్లూజివ్ న్యూరో సెంటర్ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ వ్యవస్థాపకులు, కన్సల్టెంట్ డాక్టర్లు డాక్టర్ తాళ్లూరి ప్రశాంత్ (కన్సల్టెంట్ న్యూరో సర్జన్), డాక్టర్ బిడి.భరత్ సింగ్ నాయక్ (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్), డాక్టర్ రాజేష్ పాటి (కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్), భూమాత గ్రూప్ అధినేత టి.పూర్ణచంద్ర రావు, టి.శివాజీ పాల్గొన్నారు.


హాస్పిటల్ను ప్రారంభిస్తున్న అతిథులు

# ఉత్సాహంగా వికలాంగ బాలల ఆటల పోటీలు


జిల్లాస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి -.అనకాపల్లి : అంగ వైకల్యాన్ని అధిగమించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని, వికలాంగ బాలబాలికల అభిరుచులకు తగిన విధంగా తర్ఫీదునివ్వాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. స్థానిక ఎఎంఎఎల్ కళాశాల,క్రీడా మైదానంలో ఆదివారం సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం, అనకాపల్లి పారాస్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన పారా స్పోర్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ వికలాంగ బాలబాలికలను ఆదరించి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పిఅప్పారావు మాట్లాడుతూ వికలాంగ బాలలకు తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ఎనలేని వన్నారు. ఎఎంఎఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిరంజన్ మాట్లాడుతూ వికలాంగుల ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి రామకృష్ణ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు. పారా స్పోర్ట్స్ కోచ్ రాజేష్ అప్పారావు వివిధ పాఠశాల నుండి ఫిజికల్ డైరెక్టర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు బి. ఏ. రాజు, మహాలక్ష్మి నాయుడు, దేముడునాయుడు జగన్నాధం నాయుడు, పోలిరాజు, వివిధ మండలాల నుండి దివ్యాంగ బాలలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. వికలాంగ విద్యార్థులకు 100 ,200,400 1500 మీటర్ల పరుగు పందెం, ,షాట్ పుట్, డిస్క్ త్రో, లాంగ్ జంప్, జావలిన్ త్రో వంటి క్రీడా పోటీలను నిర్వహించగా 250 మంది పాల్గొన్నారు. విజేతలకు మెమొంటోలు, పతకాలను డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, ఎపిసి అప్పారావు, లుపిన్ ఫౌండేషన్ ప్రతినిధులు విక్టర్, గంగరాజు, శిరీష అందజేశారు. ఎంఎఎంఎల్ కళాశాల ప్రతినిధులు శ్రీధరాల కృష్ణ పేరాజు, కరస్పాండెంట్ పివి రామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి జయబాబు పాల్గొన్నారు.

### రన్నింగ్లో వికలాంగ విద్యార్థి ప్రసాద్ ప్రతిభ

బుచ్చెయ్యపేట : దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి వికలాంగ విద్యార్థి పల్లి ప్రసాద్ 400 మీటర్ల పరుగు పందెంలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. విజేతకు డిఇఒ అప్పారావు నాయుడు, సమగ్రశిక్ష ఎపిసి పి.అప్పారావు, నితిన్ ఫౌండేషన్ ప్రతినిధులు మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారని ప్రత్యేక ఉపాధ్యాయులు బి అప్పలరాజు తెలిపారు. రన్నింగ్లో విజేతగా నిలిచిన విద్యార్థి ప్రసాద్ను ప్రధానోపాధ్యాయులు సత్యారావు, దేవుడు బాబు పూలరాజు,ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న పరుగు పందెం విజేత ప్రసాద్

# విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి


విజేతలకు బహుమతులు అందిస్తున్న రామకృష్ణ

ప్రజాశక్తి - కశింకోట: మండలంలోని బయ్యవరం ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఆదివారం స్వామి వివేకానంద యూత్, విభిన్న ప్రతిభావంతుల వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ పట్టుదల ఉంటే అంగవైకల్యం అడ్డురాదని ఎందరో నిరూపించారన్నారు. విభిన్న ప్రతిభావంతులను ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండి, పరస్పరం సహకరించుకోవాలన్నారు అనంతరం 25 మందికి దుప్పట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేపాడ ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, స్ఫూర్తి కాలేజ్ కరస్పాండెంట్ జి.నానాజీ, ఎస్ సూర్య, డిసిసిబి చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ దేవర చిరంజీవి, సిద్ధి శ్రీను గ్రామ నాయకులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

## పాకలపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలో ఆదివారం శ్రీధర్మశాస్త్ర రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనిల్కుమార్ నీరుకొండ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్టు డాక్టర్ నిత్య, వైద్య నిపుణుడు మహేంద్ర, పూజిత, ఆనంద్, హర్షవర్ధిని, శేషులు వైద్య సేవలందించారు. ముందుగా మాజీ సర్పంచ్ కామిరెడ్డి రామన్న, గ్రామ నాయకులు కిల్లాడ వెంకటరమణ, అల్లు సాయి, చుక్కల సత్యనారాయణలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ కన్వీనర్ వంకదార శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడం సంస్థ ధ్యేయమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజల ఆరోగ్యాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట :శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల, జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవ శిబిరంలో భాగంగా నాలుగోరోజు అరట్లకోటలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన, చైతన్య సదస్సు, ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఐ పురుషోత్తం ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థి, యువత సన్మార్గంలో నడవాలని, మత్తుపదార్థాలు చెడు సహవాసాలకు దూరంగాఉండాలని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ధూమ, మద్యపానం అనర్థాలకు వివరిస్తూ, వాటిని దూరంగా ఉండి ఆరోగ్యభారత్ నిర్మాణానికై కృషి చేయాలని, సరైన ప్రణాళికతో చదివి, లక్ష్యసాధనకు విజయపథంలో దూసుకుపోవాలన్నారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి పి భాస్కరరావు, గ్రామ సర్పంచ్ పి. అప్పలనరస, వేముల వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు కుందూరు కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సత్తరవు జంక్షన్లో కుక్కల కళేబరాలు

**-మాంసంగా విక్రయిస్తున్నారనే అనుమానాలు?**

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, మామిడిలోవ పంచాయతీ సత్తరవు జంక్షన్ వద్ద పూర్తిగా చర్మం వేరు చేసిన ఐదు కుక్కల కళేబరాలు రోడ్డుపక్కన గోనె సంచుల్లో పడేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనను చూసిన స్థానికులు షాక్కు గురై పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల కథనం ప్రకారం... అజ్ఞాత వ్యక్తులు కుక్కలను హతమార్చి, చర్మం వేరు చేసి కళేబరాలను ఇక్కడ పడేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల చర్మం, మాంసం ఏ ఉద్దేశంతో వేరు చేశారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అన్న ప్రశ్నలు ప్రజల్లో కలకలం రేపుతున్నాయి. కుక్క మాంసాన్ని మేక మాంసంతో కలిపి విక్రయిస్తున్నారనే అనుమానాలు ఇటీవల పెరిగాయని, గ్రామాల్లో కుక్కలు కనిపించకుండా పోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీని తక్షణమే పరిశీలించి, ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.